

"ఏది మంచి కాదో
దానిని
అంతం చేయడమే
మంచితనం"


# అంతరంగ యాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA DEC.2012 - MAR.2013 Rs. 2/- VOL. VII ISSUE 2


# గాయం

## ఈ గాయపడటం అనేది ఎలా జరుగుతున్నది?

గాయపడటం అంటే ఏమిటి? మాటలలో పడిపోకండి. మాటల్లో కాకుండా నిజంగానే మీ లోలోపలకు వెళ్ళండి. మీ వైపు పరికించి చూసుకోండి. మానసికంగా మీరు గాయపడ్డారు. బాల్యంలో మీ తల్లిదండ్రులు మిమ్మల్ని గాయపరిచారు. చిన్నవాడిగా ఉన్న రోజుల్లో స్నేహితులు మిమ్మల్ని గాయపరిచారు. "మీ అన్నయ్యలాగే అంతటి తెలివి నీలో ఉండాలి" అనీ, మీ బాబాయిలోని లేక మీ ప్రధానోపాధ్యాయునిలో లేదూ మరెవరిలోనో ఉన్న తెలివి మీలో లేదనీ పాఠశాలలో మిమ్మల్ని గాయపరిచారు. ఇక కళాశాలకు వచ్చాక పరీక్షలు ఉంటాయి. మీరు ఉత్తీర్ణులయి తీరాలి. మీరు గనుక కృతార్థులవకపోతే గాయపడి ఉంటారు. ఆ తరువాత ఉద్యోగం దొరకక గాయపడి ఉంటారు. ఈ ప్రపంచంలో సమస్తమూ ఎలా అమర్చుకున్నారూ అంటే అవి మిమ్మల్ని తప్పక గాయపరచి తీరుతాయి. మన విద్యావిధానం ఎంత చెడిపోయిందంటే అది మిమ్మల్ని గాయపరుస్తుంది. కాబట్టి మీకు గాయాలు తగిలాయి. అసలు మీరు గాయపడ్డారు అనే సంగతి నిజంగా మీరు గ్రహించారా? గాయపడినందువల్ల జరిగిందేమిటో చూడండి. ఇతరులను మీరు గాయపరచాలనుకుంటారు కదూ? దానిలో నుండే కోపము, ప్రతిఘటన వస్తాయి. మీలోకి మీరు ముడుచుకొని పోతారు. ఇంకా ఇంకా లోపలగా జరిగి పూర్తిగా విడిగా అయిపోతారు. అంతర్గతంగా మిమ్మల్ని విడదీసుకున్నకొద్దీ, ముడుచుకొని పోయిన కొద్దీ ఇంకా ఎక్కువగా గాయపడతారు. అందుచేత మీ చుట్టూ మీరే ఒక గోడను నిర్మించుకొని ఏమీ జరగనట్లు నటిస్తుంటారు. అయితే ఎప్పుడూ ఆ గోడల లోపలే ఇదంతా చేస్తుంటారు. ఇవీ ఆ లక్షణాలు.

సరే, మీకు గాయం తగిలింది. మీరు గాయపడ్డారు అనే సంగతి నిజంగా, చాలా లోతుగా కనుక మీరు గ్రహిస్తే, కేవలం చేతనాస్థాయిలోనే కాకుండా లోపలి లోతుల్లో గ్రహిస్తే కనుక అప్పుడు మీరు ఏం చేస్తారు? సరే, ఈ గాయపడటం అనేది ఎలా జరుగుతుంది? మీ గురించి మీకు ఒక మనోచిత్రం ఉంటుంది కాబట్టి గాయపడటం జరుగుతున్నది. నా గురించి నాకు 'నేను ఎప్పుడూ వేదిక మీద కూర్చొని ఉపన్యాసాలు ఇస్తుంటాను' అనే మనోచిత్రం గనుక ఉంటే – అదృష్టవశాత్తు అటువంటిది నాకు లేదనుకోండి – అప్పుడు సభలో శ్రోతలు నేను చెప్తున్నది నిరసించినా లేదా అసలు శ్రోతలే సభకు రాకపోయినా నా గురించి నాకు ఉన్న మనోబింబం దెబ్బ తింటుంది. వాస్తవం ఏమిటంటే, నా గురించి నాకు ఒక మనోచిత్రం ఉన్నంతవరకు ఆ మనోచిత్రం గాయపడుతూనే ఉంటుంది. ఇది స్పష్టపరిచాను కదా. స్పష్టంగా ఉన్నదా లేదా? సరే, ఇక ఇప్పుడు ఏ ఒక్క మనోచిత్రమూ కూడా లేకుండా మనం బ్రతకడం సాధ్యం కాదా? అంటే అర్థం ఏ అభిప్రాయాలూ ఉండవు. ఏ అపోహలూ ఉండవు. ఇవన్నీ కూడా మనోచిత్రాలే. మీరు నన్ను అవమానించగానే, అంటే ఏమిటంటే, నా గురించి నాకు గల మనోచిత్రానికి విరుద్ధంగా మీరు ఏమైనా అనగానే నేను గాయపడుతున్నాను అనమాట. సరే, హాని కలిగించే, గాయపరచే మాటలు ఒకరు అంటున్నప్పుడు ఆ క్షణంలోనే గాయపడుతున్నాను అనే స్పృహ కనుక ఉంటే, వారు అంటున్న దానిపై నా ధ్యాసనంతటినీ పూర్తిగా ఉంచుతే అప్పుడు ఏదీ ముద్రించుకొని పోదు, నమోదు అవదు. సావధానత లేనప్పుడు మాత్రమే గాయం లేదా పొగడ్త నమోదు అవుతుంది. మీరు వట్టి మూర్ఖులు అని ఎవరైనా అన్నప్పుడు, ఆ క్షణంలో మీ సావధానత సమస్తాన్నీ అక్కడ దానిపై ఉంచగలరా? అలా కనుక చేస్తే అప్పుడు గాయపడటం ఉండదు. ఆ సావధానతతో గతపు గాయాలు కరిగిపోతాయి. సావధానత ఒక అగ్గిమంట వంటిది. అది గతాన్ని, వర్తమానంలోని గాయాన్ని దహించి వేస్తుంది, అర్థమైంది కదూ?

*(31 ఆగస్టు 1976; బ్రాక్‌వుడ్‌లో ప్రసంగం నుండి)*

# మాటలు మంచి సాధనమే

భావ ప్రసారానికి అంటే మనం ఒకరితో ఒకరం భావాలు పంచుకోవడానికి ఒక మంచి సాధనం మాటలు. అయితే కొన్ని మాటలు ఉద్వేగపూరితమైన, మానసికమైన, నరాలకు సంబంధించిన అలజడిని కలిగిస్తుంటే కనుక, అప్పుడు భావ ప్రసారం జరగడం చాలా కష్టం.

*(9 ఆగస్టు 1952; ఒహాయిలో ప్రసంగం నుండి)*

# ధార్మిక జీవనం

ఒకరి ప్రశ్న : మతాత్మకమైన – ధర్మయుతమైన జీవితం అంటే ఏమిటో తెలుసుకోవాలను కుంటున్నాను. ఎన్నో రోజులు, నెలల పాటు నేను ఆశ్రమాలలో గడిపాను. ధ్యానించాను. ఎంతో గ్రంథ పఠనం చేశాను. రకరకాలైన దేవాలయాలను, చర్చిలను, మసీదులను దర్శించాను. నిరాడంబరంగా, ఎవ్వరికీ అపకారం చేయకుండా జీవించడానికి ప్రయత్నించాను. మనుష్యులకుగాని, జంతువులకు గాని ఏమాత్రం హాని కలిగించకుండా బ్రతకడానికి ప్రయత్నించాను. మతాత్మకమైన జీవనం అంటే ఇదేనా ఇంకేమైనా ఉన్నదా? యోగా అభ్యసించాను. జెన్ అధ్యయనం చేశాను. అనేక ధార్మిక నియమ నిబంధనలను అనుసరించాను. నేను ఇప్పుడూ ఎప్పుడూ కూడా శాకాహారినే. చూస్తున్నారుగా, నా వయసు పెరుగుతున్నది. ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో ఉన్న మహాత్ములు కొందరి వద్ద కొంత కొంత కాలం గడిపాను. ఎందుకనోగాని ఇదంతా కూడా అసలైనదాని అంచుల్లోనే ఉన్నట్లుగా నాకు అనిపిస్తున్నది. అందుచేత మీ దృష్టిలో మతాత్మకమైన, ధర్మయుతమైన జీవనం అంటే ఏమిటి అనేది ఈ రోజు మనం చర్చిస్తే బాగుంటుంది అని అనుకుంటున్నాను.

కృష్ణమూర్తి : ఒక రోజు ఒక సన్యాసి నన్ను చూడటానికి వచ్చాడు. చాలా విచారంగా కనిపించాడు. బ్రహ్మచర్య వ్రతం స్వీకరించానని, సాంసారిక ప్రపంచం వదిలేసి, భిక్షుకునిలా ఊరూరూ తిరుగుతున్నానని చెప్పాడు. అయితే దైహికమైన కాంక్షల తీవ్రతను తట్టుకోలేక ఒక ఉదయం లేవగానే తన లైంగిక సంబంధిత అవయవాలను శస్త్రచికిత్స ద్వారా తొలగించు కోవాలని నిశ్చయించుకున్నాడట. ఎన్నో నెలల తరబడి విపరీతమైన నొప్పితో బాధ పడ్డాడట. ఏదో విధంగా ఆ గాయం నయమైపోయింది. ఆ తరువాత చాలా సంవత్సరాలకు గానీ తను చేసిన పని ఏమిటో అతడికి తెలిసి రాలేదట. ఇందుకోసమే నన్ను చూడటానికి వచ్చానన్నాడు. ఆ చిన్న గదిలో కూర్చుని, ఇప్పుడు తను ఏం చేయాలని నన్ను అడిగాడు. తనను తాను అంగవిహీనునిగా చేసుకున్నాడు. మళ్ళీ మామూలుగా, అంటే శారీరకంగా సాధ్యం కాదు కానీ, అంతర్గతంగా మామూలుగా అవడం ఎలా. ఈ పని అతడు ఎందుకు చేశాడంటే మతాత్మకమైన జీవితానికి లైంగిక సంబంధిత చర్యలు కూడవు, నిషేధం కాబట్టి. లైంగిక జీవితం తుచ్ఛమైనది, అది భౌతిక సుఖాల లోకానికి సంబంధించినది. నిజమైన సన్యాసి వాటి నుండి ఎలాగైనా సరే తప్పించుకోవాలి. "నన్ను చూడండి. పూర్తిగా అయోమయంలో పడి ఉన్నాను. నా పురుషత్వం పోగొట్టుకున్నాను. నాలోని లైంగిక కాంక్షలను అణచుకోవడానికి ఎంతగానో ప్రయాస పడ్డాను. పోరాడాను. చివరకు అది ఇంత భయంకరంగా పరిణమించింది. ఇప్పుడు నేను ఏం చేయాలి? నేను చేసిన పని తప్పని తెలుసు కున్నాను. నాలోని శక్తి అంతా దాదాపుగా అంతరించి పోయింది. నా జీవితం ఇక అంధకారంలోనే ముగిసి పోయేట్లుగా ఉంది" అని అతడు అన్నాడు. అతడు నా చేతిని పట్టుకున్నాడు. కొంత సేపు మేము అలాగే నిశ్శబ్దంగా కూర్చుండి పోయాం.

ఇదా ధర్మయుతమైన జీవితం అంటే? సుఖాన్ని, సౌందర్యాన్ని నిరాకరించడం వల్ల మతాత్మక జీవనానికి మార్గం లభిస్తుందా? ఆకాశ సౌందర్యమూ పర్వతాలలో, మానవుల రూపురేఖల్లో ఉన్న సౌందర్యమూ త్యజించడం ద్వారా ధార్మిక జీవితం సిద్ధిస్తుందా? అయితే చాలా మంది సన్యాసులు, మహాపురుషులు అవును, మార్గం అదే అని నమ్ముతున్నారు. ఆ నమ్మకం పెట్టుకొని వారు తమని తాము చిత్రహింసలు చేసుకుంటారు. చిత్రహింసలకు లోనై, ముడుచుకొని పోయి, వక్రంగా తయారైన మనసు ధార్మిక జీవనం అంటే ఏమిటో ఎప్పటికైనా తెలుసుకోగలుగు తుందా? ఈ చిత్రహింసలే, ఈ అవకర అకృత్యాలే ఆ దేవుడిని లేదా యధార్థతత్వాన్ని లేదూ ఇంకొక పేరు ఏదైనా సరే దానిని చేరుకోవడానికి ఏకైక మార్గం అని వారంతా బల్ల గుద్ది చెప్తుంటారు. ఆధ్యాత్మిక లేక మతాత్మక జీవితం అనబడేది వేరు, ప్రాపంచిక జీవితం వేరు అని ఆ రెండింటినీ వారు విడివిడిగా చూపుతుంటారు.

సుఖాల కోసం మాత్రమే జీవిస్తున్న మనిషి, అప్పుడప్పుడు తటస్థపడే దుఃఖమూ, దైవభక్తి అతనిలో ఉన్నా, తన సమస్త జీవితమూ కనుక అతడు వినోదాలతో కాలక్షేపాలతో గడుపుతూ ఉంటే అప్పుడతడు తప్పకుండా ఐహిక ప్రపంచానికి చెందినవాడే. ఒకవేళ అతడిలో చాలా చతురత, చాలా పాండిత్యమూ ఉన్నా సరే; ఎవరో చెప్పినవో, తను స్వంతంగా చింతన చేసినవో అయిన విషయాలతో తన జీవితాన్ని నింపుకున్నా సరే అతడు ప్రాపంచికుడే. ఒకరికి సహజసిద్ధమైన ప్రతిభ ఏదైనా ఉండి, సమాజ లబ్ధి కోసమో, తన స్వంత సుఖం కోసమో ఆ ప్రతిభను ఉపయోగిస్తుంటే కనుక, అప్పుడు కూడా అతడు తప్పకుండా ప్రాపంచికుడే అవుతాడు. అంతే కాకుండా చర్చికో దేవాలయానికో మసీదుకో వెళ్ళడమూ, ప్రార్థనలు చేయడమూ, అపోహలలో అంధవిశ్వాసాలలో మునిగిపోయి ఉండి, వీటన్నింటిలో ఉన్న క్రూర నిర్దాక్షిణ్యతను గురించి స్పృహే లేకపోవడమూ కూడా ప్రాపంచికత్వమే. దేశభక్తీ, జాతీయవాదమూ, ఆదర్శవాదమూ కూడా ఐహికతే. ఒక ఆశ్రమంలోనో, మఠంలోనో తలుపులు మూసుకొని కూర్చొని, సదా చేతిలో ఒక పుస్తకం ధరించి పారాయణం చేస్తూ ప్రార్థనలు చేస్తూ గడపడం కూడా నిస్సందేహంగా ప్రాపంచికతే. లోకంలో మంచి పనులు చేయడం కోసం బయలుదేరిన మనిషి అతడు సమాజ సంస్కర్త అవచ్చు, మత ప్రచారకుడు అవచ్చు – అతడు కూడా లోకాన్ని ఉద్ధరించాలనుకునే రాజకీయవాది లాంటివాడే. ధార్మిక జీవనానికి, ఐహిక జీవనానికి మధ్య గీత గీసి విభజించడమే ఐహికత్వపు ప్రధాన లక్షణం. సన్యాసులు కానివ్వండి, మహాత్ములూ సంస్కర్తలూ కానివ్వండి – వారి మనసులకూ విషయసుఖాలకే అంకితమై పోయిన వారి మనసులకూ ఏమాత్రం తేడా లేదు.

అందుచేత జీవితాన్ని ప్రాపంచికమూ ప్రాపంచికము కానిదీ అని విభజించుకోక పోవడం చాలా ముఖ్యం. ఆధ్యాత్మికమైనవి అని అనుకొనే వాటినీ, ప్రాపంచికమైన వాటినీ వేరువేరుగా విడదీసి చూడకూడదు. ఇది చాలా ముఖ్యం. విషయ ప్రపంచం లేకుండా, పదార్థ ప్రపంచం లేకుండా మనమూ ఇక్కడ ఉండం. అందమైన ఆకాశము, ఆ కొండ మీద ఒంటరిగా నిల్చుని ఉన్న వృక్షము, నడచి వెళుతున్న ఆ స్త్రీ, గుర్రం పైన స్వారీ చేస్తున్న ఆ మనిషి – ఇవేవీ లేకుండా జీవితం ఉండటం సాధ్యం కాదు. మనకు కావలసినది సమస్తమైన సంపూర్ణమైన జీవితం. అందులోని ఏదో ఒక ప్రత్యేకమైన భాగం

కాదు. ఆ ప్రత్యేక భాగం మాత్రమే ధార్మికత, తక్కినదంతా దానికి వ్యతిరిక్తమైనది అనడం సరికాదు. అందుచేత మతాత్మక ధార్మిక జీవనం అంటే మొత్తం జీవితానికి సంబంధించినదే తప్ప ఏదో ఒక భాగానికి మాత్రమే పరిమితమైనది కాదు.

ప్ర: మీరు చెప్తున్నది నాకు అర్థమైంది. మనం జీవితం మొత్తంతో వ్యవహరించాలి. ఆ ఆధ్యాత్మికం అని అనబడే దానిని ఐహిక ప్రపంచంతో వేరు చేయకూడదు. అందుచేత ప్రశ్న ఏమిటంటే – జీవితంలోని అన్నింటి ఎడల ధార్మికంగా, మతాత్మకంగా ఏ విధంగా ప్రవర్తించ గలుగుతాం?

కృ: ధార్మికంగా ప్రవర్తించడం అంటే అర్థం ఏమిటి? అంటే అర్థం విభజన లేనటువంటి జీవన విధానమని కదూ? ప్రాపంచికమూ, ధార్మికమూల మధ్య, 'ఇలా ఉండాలి'కీ 'ఇలా ఉండకూడదు'కీ మధ్య, నాకూ మీకూ మధ్య, ఇష్టానికీ అయిష్టానికీ మధ్య విభజన లేకపోవడం. ఈ విభజనే సంఘర్షణ. సంఘర్షణతో కూడిన జీవనం ధార్మిక జీవనం కాదు. సంఘర్షణను లోతుగా అర్థం చేసుకున్నప్పుడే ధార్మిక జీవనం సాధ్యమవుతుంది. ఈ అవగాహనే తెలివి. సవ్యమైన చర్యను జరిపేది ఇదుగో ఈ తెలివే. చాలా మంది తెలివి అని అనుకునేది కేవలం ఒక నైపుణ్యం, ఒక ప్రత్యేకమైన పనిలో చాకచక్యం. లేదా వ్యాపార వ్యవహారాల్లో చాతుర్యం; లేదా రాజకీయాల్లో కుటిలత్వం.

ప్ర: కాబట్టి నా ప్రశ్నలో ఉన్న అసలు సందేహం ఏమిటంటే సంఘర్షణ లేకుండా జీవించడం, ఒక నిజమైన నిర్మలతను పొందడం ఎట్లా అని. అయితే ఇది మతం అనే ఒక కారాగారపు నిబద్ధత ద్వారా కలిగిన వట్టి మనోద్వేగ పూరితమైన పవిత్రతా భావం కాదు. ఆ కారాగారం ఎంత ప్రాచీనమైనదైనా సరే, ఎంత గౌరవనీయమైనదైనా సరే.

కృ: ఎక్కడో ఒక గ్రామంలో తనలో పెద్దగా సంఘర్షణ ఏదీ లేకుండా జీవిస్తున్న మనిషిగాని ఒక 'పవిత్ర తీర్థపు' కొండ చరియ మీద ఒక గుహలో కూర్చుని కలలు కంటున్న మనిషిగాని మనం ఇప్పుడు చెప్పుకుంటున్నటువంటి ధార్మిక జీవనం గడపడం లేదని గట్టిగా చెప్పవచ్చు. సంఘర్షణను అంతం చేసుకోవడం చాలా చాలా క్లిష్టమైన సంగతి. దీనికి స్వీయ-పరిశీలన అవసరం. బాహ్యం ఎడల, ఆంతరికం ఎడల సున్నితమైన ఎరుక కలిగి ఉండటం అవసరం. తన లోపల గల పరస్పర వైరుధ్యాన్ని అవగాహన చేసుకున్నప్పుడు మాత్రమే సంఘర్షణ అంతరిస్తుంది. తెలిసినది నుండి, అంటే గతం నుండి విముక్తి చెందనప్పుడు, ఈ సంఘర్షణ ఎప్పటికీ ఉంటూనే ఉంటుంది. గతం నుండి విముక్తి అంటే ప్రస్తుతంలో జీవించడం. ప్రస్తుతం – ఇప్పుడు కాలానికి సంబంధించినది కాదు. ఇందులో స్వేచ్ఛ కదలికలు మాత్రమే ఉంటాయి. అవి గతం చేత, జ్ఞాతం చేత స్పృశింపబడనివి.

ప్ర: గతం నుండి విముక్తి అంటే అర్థం ఏమిటంటారు?

కృ: గతము అంటే అదంతా పూర్తిగా మనం నిలవ చేసుకున్న స్మృతులే. ఈ స్మృతులు వర్తమానంలో చర్య జరుపుతూ భవిష్యత్తును గురించి ఆశలను, భయాలను సృష్టిస్తుంటాయి. ఈ ఆశలూ భయాలే మానసిక భవిష్యత్తు. ఇవి లేకుండా భవిష్యత్తు అనేది లేదు. అందుచేత, గతము యొక్క చర్యే వర్తమానం అవుతున్నది. ఇక మనసు అంటే గతం యొక్క కదలికలే, గతపు చలనమే. గతము వర్తమానంలో పనిచేస్తూ, మనం భవిష్యత్తు అని అనే ఒక దానిని సృష్టిస్తున్నది. ఈ గతపు చలనం అసంకల్పిత చర్య. అంటే, ఇలా ప్రతిస్పందించమని ఆదేశం గానీ, ఆహ్వానం గానీ లేకుండానే దానంతట అదే, మనకు తెలియకుండానే వచ్చి క్రియ జరుపుతుంది.

ప్ర: ఇటువంటి పరిస్థితిలో దాని నుండి, ఆ గతం నుండి మనం విడుదల ఎట్లా పొందుతాం?

కృ: ఈ చలనం ఎడల ఎంపిక లేని ఎరుక కలిగి ఉండాలి. ఎందుకంటే, ఎంపిక చేసుకోవడము అంటేనే అది గతం జరిపే చర్య. ఈ ఎంపిక లేని ఎరుక అంటే గతం పని చేస్తున్నప్పుడు పరిశీలించడం. అటువంటి పరిశీలన గతపు కదలిక కాదు. ఆలోచనలు అనే మనో చిత్రాలు లేని పరిశీలన అంటే గతము పూర్తిగా అంతరించి పోయిన చర్య అన్నమాట. ఒక చెట్టును ఆలోచన లేకుండా పరిశీలించడము అంటే అది గతము తనలో లేనటువంటి చర్య అన్నమాట. గతం జరిపే చర్యలను పరిశీలించడము అంటే కూడా గతము తనలో లేని చర్యే. చూడబడే అంశం కంటె చూస్తూ ఉన్న స్థితి చాలా ప్రధానమైనది. అటువంటి ఎంపిక రహితమైన పరిశీలనలో గతపు ఎరుక ఉండటము అంటే విభిన్నంగా చర్య జరపడం. అంతేకాకుండా అసలు పూర్తిగా విభిన్నంగా కొత్తగా ఉండటం. ఈ ఎరుకలో స్మృతి ఏ అవరోధాలు లేకుండా సమర్థవంతంగా పనిచేస్తుంది. ఆధ్యాత్మికత, ధార్మికత అంటే ఎంపిక లేని ఎరుకతో ఉండటం. ఎంతగా అంటే జ్ఞాతం నుండి సంపూర్ణంగా విముక్తమై పోవడం. అయితే అప్పుడు కూడా ఆ జ్ఞాతం తను ఎక్కడ పని చేయాలో అక్కడ పనిచేస్తూనే ఉంటుంది.

ప్ర: కానీ ఆ జ్ఞాతం, ఆ గతం పనిచేయకుండా ఉండవలసినప్పుడు కూడా చర్య జరుపుతూనే ఉంటుందే. అట్లా పని చేస్తూ సంఘర్షణను సృష్టిస్తూ ఉంటుంది.

కృ: ఈ దీని ఎరుకతో ఉండటం కూడా, చర్య జరుపుతున్న గతానికి సంబంధించినంత వరకు – క్రియారహితమైనటువంటి ఒక స్థితిలో ఉండటం. అందుచేత నిజమైన ధార్మిక జీవనం అంటే గతం నుండి విడుదల. అంటే అర్థం గతాన్ని తుడిచిపెట్టి వేయాలని కాదు. పూర్తిగా విభిన్నమైన మరొక ఆయతన పార్శ్వంలో ప్రవేశించడం – అక్కడి నుండి తెలిసిన దానిని, జ్ఞాతాన్ని పరిశీలించడం. ఇటువంటి ఎంపిక లేని చూడడము అనే ఈ చర్య ప్రేమపూరితమైన చర్య. ధార్మిక జీవనము అంటే ఈ చర్య. అసలు జీవించడం అంటే ఈ చర్యే. ధార్మికమైన మనసు అంటే ఈ చర్యే. అందుచేత మత ధర్మము, మనసు, జీవితము, ప్రేమా అన్నీ ఒకటే.

*(అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్ నుండి; పుటలు 53-57)*

## ప్రశ్న – సమాధానము

సమాధానం కావాలి అని అనుకోకుండా ఒక ప్రశ్నను అడిగితే సమాధానం మీకు లభిస్తుంది. కానీ సమాధానాన్ని ఆశిస్తూ కనుక మీరు ప్రశ్నను అడిగితే అప్పుడు మీకు లభించే సమాధానం మీ నిబద్ధతను అనుసరించే ఉంటుంది.

*(14 జనవరి 1962;*
*వారణాసిలో ప్రసంగం నుండి)*

## తలుపులు తెరచే ప్రశ్న

ఒక రకమైన ప్రశ్నించడం ఉంటుంది. అది కేవలం ప్రశ్నించడం మాత్రమే. సమాధానం కనుక్కోవడం కోసం ప్రయత్నం కాదు. అటువంటి ప్రశ్నించడమే తలుపులను తెరుస్తుంది. మీరే చూసి కనిపెట్టవచ్చు. పరికించి గ్రహించవచ్చు. పరిశీలించవచ్చు. ఆలకించవచ్చు.

*(13 డిసెంబరు 1961; మద్రాసులో ప్రసంగం నుండి)*

# బాధను అర్థం చేసుకోవడం

ఒక పక్కన నేను బాధలో ఉండి, సంతోషం అనేది ఉన్నదా అని అడగడం సమంజసమేనా? ఆ బాధను నేను అర్థం చేసుకోలేనా? అసలు సమస్య అదీ. అంతే తప్ప సంతోషంగా ఉండటం ఎలా అనేది కాదు. బాధ లేనప్పుడు నేను సంతోషంగా ఉన్నట్లే. అయితే, సంతోషంగా ఉన్నాను అనే స్పృహ కలిగితే అప్పుడు అది సంతోషం కాదు.

అందుచేత బాధ అంటే ఏమిటి అనేది నేను అవగాహన చేసుకోవాలి. నా మనసులో కొంత భాగం సంతోషం కోసం వెతుక్కుంటూ, ఈ వ్యధలో నుండి బయటపడాలని ప్రయత్నిస్తూ అటూ ఇటూ పరుగులు పెడుతూ ఉంటే గనుక బాధను అవగాహన చేసుకోగలుగుతానా? అందుచేత, బాధను అర్థం చేసుకోవాలంటే దానితో పూర్తిగా ఏకమై పోవాలి. తిరస్కరించకూడదు. సమర్థించకూడదు. ఖండించకూడదు. పోల్చి చూడకూడదు. బాధతో పూర్తిగా ఒక్కటై పోయి ఆ బాధను అర్థం చేసుకోవాలి. అవునా కాదా?

వినడం ఎలా అనేది నాకు తెలిసినప్పుడు నిజమైన సంతోషం ఏదో అది కలుగుతుంది. బాధను ఎలా వినాలో నేను తెలుసుకోవాలి. బాధను వినగలిగితే సంతోషాన్ని కూడా వినగలుగుతాను. ఎందుకంటే 'నేను' అంటే అదే.

*('ముందున్న జీవితం' నుండి)*

# కోరికలో ఉన్న బాధ

చాలా మందికి కోరిక ఒక పెద్ద సమస్య అయి కూర్చుంది. ఆస్తి కావాలని, హోదా కావాలని, అధికారం కావాలని, ఉపశమనం పొందాలని; అంతే కాదు, మృత్యువు లేకుండా ఎల్లకాలం ఇలాగే సజీవంగా ఉండిపోవాలని, ప్రేమింపబడాలని, శాశ్వతమైనదీ, సంతృప్తిని ఇచ్చేదీ, చిరకాలం నిలిచిపోయేదీ, కాలానికి అతీతమైనదీ ఏదో అది కావాలని – రకరకాల కోరికలు. సరే, కోరిక అంటే ఏమిటి? మనల్ని ఇలా ప్రేరేపిస్తూ, ఒత్తిడి చేస్తూ నెడుతున్న ఆ అది ఏమిటి? అలాగని మనకు ఉన్నదానితోను, మనం ఎలా ఉన్నామో దానితోను తృప్తి పడిపోయి ఉండాలని కాదు. ఇది నిజానికి మనం కావాలి అని కోరుకుంటున్న దానికి సరిగ్గా వ్యతిరేకమైనది. అసలు కోరిక అంటే ఏమిటి అనేది చూడాలని మనం ప్రయత్నిస్తున్నాము. దాని లోపలకు కనుక సంశయిస్తూ, తటపటాయిస్తూ, మెల్లగా అడుగులు వేసు కుంటూ వెళితే బహుశ ఒక పరివర్తన జరగవచ్చేమో. ఈ పరివర్తన అంటే కోరిక కోరుతున్న అంశాన్ని మార్చి, ఆ అంశం స్థానంలో మరొక అంశాన్ని ఆ స్థానంలో పెట్టడం కాదు. సాధారణంగా 'మార్పు' అంటే ఇదే అని మనం అనుకుంటాం. అవునా కాదా? కోరిక కోరుకుంటున్న ఆ అంశం మీద అసంతృప్తి చెంది, దాని స్థానంలో మరొక అంశాన్ని తీసుకొచ్చి పెడతాము. కోరిక కోరుతున్న అంశాన్ని సదా మారుస్తూ, అంతకంటె ఉన్నతమైనదీ, ఉత్తమమైనదీ, సంస్కారవంతమైనదీ అయిన అంశం అని మనం పరిగణించే అంశాన్ని ఆ స్థానంలో పెడుతూ ఉంటాము. ఎంత సంస్కార వంతమైన దాని కోసం కోరుకున్నా కోరిక కోరికే గదా. ఈ రకంగా కోరిక కదిలిపోతూ ఉన్నప్పుడు అందులో అంతులేని ప్రయాస – పోరాటం ఉంటుంది. అది రెండు వ్యతిరేకాల మధ్యన ఉండే సంఘర్షణ.

అందుచేత, ఈ కోరిక అంటే ఏమిటో తెలుసుకోవడం, దానిలో పూర్తిగా పరివర్తన తేగలమా అనేది కనిపెట్టడం ముఖ్యం కదూ?

– – –

ఈ కోరికకు ఏది కేంద్రమో ఆ కేంద్రాన్నే కరిగించి వేయలేమా? అంటే, ఏదో ఒక కోరికకు, ఒక అభిలాషకు, ఒక లాలసకు అని కాదు. అసలు కోరిక, కాంక్ష, ఆశ అనే ఆ మొత్తం నిర్మాణాన్ని. అందులో నిరాశ అనే భయం ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది కదూ? నేను నిరాశ చెందిన కొద్దీ 'నేను'కు ఇంకా ఎక్కువ బలం చేకూరుస్తుంటాను. ఆశిస్తూ ఉన్నంతవరకు, కాంక్షిస్తూ ఉన్నంత వరకు నేపథ్యంలో భయం ఉంటూనే ఉంటుంది. ఆ భయం మళ్ళీ ఆ కేంద్రాన్ని ఇంకా బలంగా చేస్తూ ఉంటుంది.

భౌతిక అవసరాలు కాకుండా, మరే రకమైన కోరిక అయినా సరే – గొప్పదనం కోసం, సత్యం కోసం, సద్గుణాల కోసం కోరే కోరిక – ఒక మానసిక ప్రక్రియగా అవుతుంది. ఈ ప్రక్రియతోనే మనసు 'నేను' అనే భావనను నిర్మిస్తుంది. ఆ కేంద్రంలో తనను తాను ఇంకా బలంగా తయారు చేసుకుంటుంది.

*(కలెక్టడ్ వర్క్స్, వాల్యూమ్ 7; పుట – 40)*

# కోరిక జననం

ముందు చూడటం, పరికించడం ఉంటుంది. అది ఒక ఇంద్రియ సంచలనంగా అవుతుంది. ఆ తరువాత స్పృశించడం ఉంటుంది. ఆ పైన కోరిక. దానిని తను పొందాలనే కోరిక. ఆ ఇంద్రియ సంచలనం ఎడతెగకుండా ఉండిపోవాలనే కోరిక. ఇందులో క్లిష్టత ఏమీ లేదు. చాలా సరళంగా ఉన్న సంగతే.

ఒక అందమైన స్త్రీని లేదా పురుషుడిని చూస్తారు. అప్పుడు చూడటం అనే సుఖం కలుగుతుంది. ఆ సుఖం తను ఆగిపోకుండా కొనసాగుతూ ఉండాలని పట్టుబడుతుంది. అందుచేత నేను ఆలోచించడం ఆరంభిస్తాను. అందులో నుండి ఒక ఆలోచన పుట్టుకొస్తుంది. ఆలోచన ఆ సుఖం గురించి ఆలోచించినకొద్దీ ఆ సుఖం లేదా ఆ బాధ ఆగిపోకుండా కొనసాగుతూ ఉంటుంది. ఎక్కడైతే ఈ కొనసాగడం ఉంటుందో అక్కడ 'నేను' ప్రవేశిస్తుంది. నాకు అది కావాలి, నాకు అది వద్దు. నిద్రపోతున్నా మేలుకొని ఉన్నా రోజు పొడుగునా మనం అందరమూ చేస్తున్నది ఇదే.

సరే, కోరిక ఎలా పుట్టుకొస్తున్నదో చూశారు. చూపు, స్పృశింపు, ఇంద్రియ సంవేదన. ఆ పైన ఆ ఇంద్రియ సంచలనానికి కొనసాగింపునివ్వడం. ఇంద్రియ సంవేదనకు కొనసాగింపే కోరిక. కోరికలో మార్మికత, రహస్యమూ ఏమీ లేవు. అయితే కోరికలో కాకుండా, కోరిక దేని ద్వారా నైతే తనను నెరవేర్చుకోబోతున్నదో ఆ విషయంలో వైరుధ్యం కనుక ఉంటే అప్పుడు కోరిక చాలా జటిలంగా అవుతుంది. సరేనా? నేను చాలా ధనవంతుడిని అవాలని కోరుకుంటున్నాను. అంటే, నా కోరిక నాకు చాలా ధనం కావాలని అంటుంది. ఎందుకంటే, ఆస్తిపరులను, కారు ఉన్నవారిని, ఇంకా అటువంటివి ఏవేవో ఉన్న సంపన్నులను నేను చూశాను. కాబట్టి "నాకు తప్పక అవి కావాలి. నేను తృప్తి చెంది తీరాలి" అని కోరిక అంటుంది.

*(కలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్ 15; పుటలు 16–17)*

# సమస్య కోరిక కాదు. ఆ కోరిక గురించి మనం ఏం చేస్తుంటామో అదీ సమస్య

కోరికను పరిశీలిద్దాం. తనను తానే వ్యతిరేకించుకునే కోరిక ఉంటుందని మీకు తెలుసు కదూ? తనను తాను చిత్రహింస చేసుకుంటూ పరస్పర విరుద్ధమైన దిశలలోకి నెట్టుకుంటూ పోయే కోరిక మీకు తెలుసు కదూ? ఆ బాధ, ఆ ఆందోళన, కోరిక కలిగించే ఆతృత, మళ్ళీ ఒక దారిలోకి తేవడానికి క్రమశిక్షణలో పెట్టుకోవడం, అదుపులో పెట్టడం – ఇదంతా మీకు తెలుసు. కోరికతో చేసే ఈ అంతులేని సమరంలో ఆ కోరిక స్వరూపాన్ని మెలికలు తిప్పేసి గుర్తుపట్ట లేకుండా చేసుకుంటాం. అయితే కోరిక మాత్రం కన్నార్పకుండా చూస్తూ, నిరీక్షిస్తూ, ముందుకు తోస్తూ ఎప్పటికీ అక్కడే ఉండిపోతుంది. మీరు ఏమైనా చేయండి. కోరికలోని తీవ్రతను తగ్గించి ఉదాత్తంగా చేయండి, తప్పించుకొని పారిపోండి, నిరాకరించండి, ఆమోదించండి, కోరికను ఇష్టారాజ్యంగా ప్రవర్తిల్ల నీయండి. ఏం చేసినా సరే. అది మాత్రం అక్కడే ఉంటుంది. మతాచార్యులు మొదలైన పెద్దలంతా ఏమంటారో మీకు తెలుసు. కోరికలు ఉండకూడదని, నిర్మోహం అలవరచుకోవాలని, కోరికల నుండి విడుదల పొందాలనీ వారంతా బోధిస్తుంటారు. నిజంగా చూస్తే ఈ మాటల్లో అర్థం లేదు. ఎందుకంటే కోరికను అవగాహన చేసుకోవాలి తప్ప పరిహరించ కూడదు. కోరికను కనుక హతమారిస్తే జీవితాన్నే హతమార్చుకున్నట్లు అవుతుంది. కోరికను వక్రంగా తయారు చేయడమూ, దాని ఆకార స్వరూపాలను మార్చడమూ, అదుపులో పెట్టడమూ, దానిని మన ఆధీనంలో ఉంచుకోవడమూ, కోరికను అణచి వేయడమూ కనుక చేస్తే మహా అద్భుతమైన, ఎంతో సుందరమైన ఒక దానిని మీరు ధ్వంసం చేస్తున్నారనమాట.

*(కలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్ 12; పుట 244)*

# కోరికను గురించి ఏమీ చేయకుండా ఉండటం సాధ్యమవుతుందా?

మనలో చాలా మందికి కోరిక అంటే తమ సుఖాలూ తమ ఇష్టాలూ నెరవేర్చుకోవడం. తమ సంగతి చెప్పుకోవడం. నేను అది కోరుకుంటున్నాను. నాకు అది తప్పక లభించి తీరాలి. ఆ కోరిక ఒక అందమైన మనిషి కోసం అవచ్చు. ఒక ఇల్లో ఒక ఊహో కూడా కావచ్చు. ఏదైనా సరే అది నాకు తప్పక లభించి తీరాలి. ఎందుకని? ఎందుకు ఈ 'తప్పక' అనేది పుట్టుకొస్తున్నది? కోరిక 'నాకు అది తప్పక లభించి తీరాలి' అని ఎందుకు అంటుంది? అందువల్లనే కదా ఈ మనస్తాపం, ఈ ఒత్తిడి, ఈ కాంక్ష, దుర్భరమైన ఈ జీవన సమస్యలూ జనిస్తున్నాయి. చాలా వరకు ఇది సుస్పష్టంగా కనబడుతున్నది కదా. తన సంగతి చెప్పుకోవడం – స్వీయపు అభివ్యక్తీకరణ గురించి ఎందుకని ఇంత పట్టుదల? – ఇది ఒక రకమైన కోరిక కదూ? స్వీయపు అభివ్యక్తిలో, తనకు ఒక ప్రత్యేకత లభించడంలో విపరీతమైన సంతోషం కలుగుతుంది. ఎందుకంటే మీకు ఒక గుర్తింపు దొరికింది. "అమ్మో! ఆయన ఎవరో తెలుసా?" అని అందరూ అంటుంటారు. ఇంకా ఎన్నో అటువంటి మతిలేని మాటలు అంటుంటారు. ఇది వట్టి కోరిక కాదు. ఇది కేవలం సుఖం కాదు. ఎందుకంటే ఈ కోరిక వెనుక ఇంకా బలవత్తరమైనది ఏదో ఉన్నదీ అని మీరు అంటారు. కానీ సుఖాన్ని, కోరికను అవగాహన చేసుకోకుండా ఆ అంతదాకా మనం వెళ్ళలేము. కోరిక, సుఖము పనిచేస్తూ ఉండే ఆ ప్రక్రియను మనం చర్య, క్రియ అని అంటాము. నాకు ఒకటి ఏదో కావాలి. అందుకోసమై నేను పనిచేసి, చేసీ, చేసీ అది చేజిక్కించుకుంటాను. ఒక రచయితగానో చిత్రకారునిగానో పేరు ప్రఖ్యాతులు కావాలని నేను కోరుకుంటాను. ఇక ఆ ఖ్యాతి సంపాదించడానికి నేను ఎన్ని చేయాలో అన్నీ చేస్తాను. సాధారణంగా జరిగేదేమిటంటే నేను అనామకంగానే మిగిలిపోతాను. లోకం నన్ను గుర్తించనే గుర్తించదు. అందుచేత నాలో నిరాశా నిస్పృహా మిగులుతాయి. ఎంతో మనస్తాపం చెందుతాను. ఇక ఆ తరువాత నిరాశవాదిగా మారుతాను. లేదా అంటే ఎంతో వినయం ఉట్టిపడుతున్నట్లు నటిస్తాను. ఇక అన్నీ ఆ రకమైన అర్థం పర్థం లేని పనులే చేయడం మొదలుపెడతాను.

*(కలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్ 15; పుట 166)*

# చనిపోవడం అనే వింతైన అనుభవం

మరణం అంటే భయం కాబట్టి వైద్యుల వద్దకు వెళతాం. కొత్త కొత్త మందులు, మాత్రలు తీసుకుంటాం. ఈ ప్రయత్నాలతో బహుశ మరొక ఇరవై లేక ముప్ఫయి సంవత్సరాలు జీవించవచ్చు. కానీ అది మాత్రం అనివార్యం. మలుపులో ఎక్కడో దాగి ఉండనే ఉంటుంది. ఆ వాస్తవాన్ని, ఎట్ట ఎదుటగా నిలబడి చూడటానికి – దానిని గురించి ఆలోచించడం కాదు, ముఖాముఖంగా చూడటానికి – గతం ఎడల మరణించిన మనసు అవసరం. నిజంగానే తెలియదు అనేటటువంటి స్థితిలో ఉన్న మనసు ఉండాలి...

ఆశించడమో, నిరాశా నిస్పృహల్లో పడటమో చేస్తుంటే కనుక మళ్ళీ ఆ సీమ లోపలే, కాలం అనే ఆ సీమలో, భయం అనే ఆ సీమలో ఆ సీమ లోపలే ఉండిపోతారు.

చనిపోవడము అనే ఆ మహా వింతైన అనుభవాన్ని అనుభవించాలి. అంటే ఎప్పుడో దేహం మరణించబోతున్న చివరి క్షణాలలో మీరు స్పృహ కోల్పోయినప్పుడు కాదు. శరీరం ప్రమాదానికి లోనయినప్పుడో, వ్యాధి కారణంగానో, మత్తుమందుల కారణంగానో మనసు మొద్దుబారి, జడంగా తయారైనప్పుడు కాదు. పూర్తిగా స్పృహలో ఉన్నప్పుడే అనేకానేకమైన 'నిన్న'లకు మరణించడం. పరిపూర్ణమైన జీవశక్తితో, ఎరుకతో మరణించడం. ఇది తప్పకుండా ఏమీ తెలియదు అనే స్థితిలో ఉన్నటువంటి మనసును కలుగజేస్తుంది. కాబట్టి ధ్యానిస్తున్న మనసును. అదే ధ్యానిస్తున్న మనసు.

*(29 మే 1960; ఒహాయిలో ప్రసంగం నుండి)*

# పూవు తనను ప్రేమించమని అడగదు

మీరు నడుస్తున్న బాటకు ఒక పక్కగా పూచిన పూవును ఎప్పుడైన గమనించారా? ఆ పూవు సౌందర్యాన్ని, ఆ పూవు రంగును గమనించారా? ఆ పూవుకు ఒక పరిమళం కూడా ఉంటుంది. తన వైపు చూడమని ఆ పూవు మిమ్మల్ని అడగడం లేదు. తన పరిమళాన్ని ఆఘ్రాణించమనీ అనడం లేదు. ఆ పూవు అక్కడ ఉన్నది. అంతే. కానీ మనమో? మనలో, మానవులలో ఆలోచన అనే ఒక యాంత్రిక ప్రక్రియ ఉన్నది. అది ఏమంటుందంటే 'నేను ప్రేమింపబడాలి. నాకు తగినంత ప్రేమ లభ్యమవలేదు' అంటుంది. లేదా 'నిన్ను నేను ప్రేమించి తీరాలి' అని అంటుంది. అందుచేత మన దుఃఖానికి ఒక కారణం ఈ ప్రేమరాహిత్యం, నన్ను ఎవరూ ప్రేమించడం లేదు అనే భావం. అవునా కాదా? పైగా ప్రేమ అంటే ఫలానా విధంగానే వ్యక్తపరచాలి అని కొన్ని గిరులు గీస్తాం. లైంగిక సంబంధంలో కాని, సాన్నిహిత్యంలో కాని, స్నేహంలో కాని దైహిక కలయిక అనీ, ఆత్మిక అనుబంధం అనీ అంటూ ఇలాగే ఉండితీరాలి అని కోరుకుంటాం. ఇదంతా చూస్తుంటే, మనిషి మనసు తన అవసరాల తీవ్రతకు తగినట్లుగా సరిపడే సంబంధ బాంధవ్యాన్ని మరో మనిషి నుండి కోరుకుంటుంది అని తెలుస్తుంది. అవునంటారా? ఇది ప్రేమకు నిరోధమవుతుంది. అందుచేత ప్రేమ లేకుండా పోతుంది. నేను ముందే చెప్పినట్లుగా దుఃఖాన్ని అంతం చేసి వేసినప్పుడే ప్రేమ ఉంటుంది. దుఃఖం అనే ఆ వలయం లోపల, ఆ సీమ పరిధుల్లో ప్రేమ జీవించలేదు.

*(సానెన్ 1972 ప్రసంగం నుండి)*

*'అంతరంగయాత్ర' మీ స్నేహితులకు పంపదలుచుకుంటున్నారా? వారి చిరునామాలు మాకు తెలపండి. ఉచితంగా పత్రికను వారికి పంపుతాము. పాఠశాలలకు, కళాశాలలకు, గ్రంథాలయాలకు కూడా చిరునామా తెలుపుతే పంపుతాము.*

# దృశ్యం - శ్రవణం

కాకి ఒకటి గొంతు చించుకొని అరుస్తున్నది. బాగా పెరిగిన ఆకులతో రెమ్మలతో దట్టంగా ఉన్న కొమ్మ మీద కూర్చుని అరుస్తున్నది. కంటికి కనబడటం లేదు. ఇతర కాకులు ఎన్నో వస్తున్నాయి, పోతున్నాయి. ఇది మాత్రం తన కీచు గొంతుకతో గావు కేకలు పెట్టడం క్షణం సేపు కూడా ఆపడం లేదు. ఎందుకనో గాని ఆ కాకికి మహా కోపంగా ఉన్నది. దేనిని గురించో గాని ఫిర్యాదు చేస్తూ తిట్టి పోస్తున్నది. దాని చుట్టూ ఉన్న ఆకులు గజ గజ వణికి పోతున్నాయి. సన్నగా పడుతున్న వాన చినుకులు కూడా ఏమీ చేయలేకపోతున్నాయి. ఆ కాకికి అలజడి కలిగించిన విషయం ఏమిటో గాని మొత్తానికి కాకి అందులో పూర్తిగా మునిగిపోయి ఉంది. ఒక్కసారి మాత్రం బయటకు వచ్చి రెక్కలు విదుల్చుకొని ఎగిరి పోయింది. కాని అంతలోనే తిరిగి వచ్చి తన తిట్ల దండకం కొనసాగించింది. ప్రస్తుతం అలసిపోయి విశ్రాంతి తీసుకుంటున్నది. అదే కాకి, అదే స్థానంలో కూర్చుని ఇప్పుడు కొత్తరకంగా, ఉదాత్తమైన తీరులో, ఎంతో స్నేహపూరితమైన స్వరంతో కావు కావు మంటూ పిలుస్తున్నది. ఆ చెట్టు పైన ఇంకా ఎన్నో పక్షులున్నాయి. తీయని పాటల కోయిల ఉన్నది. నల్లని రెక్కలతో, మెరిసే పసుపు రంగు ఒంటితో ఒక పక్షి ఉన్నది. మెరుగు తగ్గిన వెండి రంగులో లావుగా ఉన్న పక్షీ, చెట్టు మొదలును ముక్కులతో పొడుస్తూ ఉన్న పక్షులూ ఎన్నో ఉన్నాయి. ఒంటి మీద చారలున్న చిన్న ఉడుత ఒకటి వచ్చి చకచకా చెట్టు పైకి ఎగబ్రాకుతున్నది. ఆ చెట్టు మీద ఎన్నో ప్రాణులు ఉన్నాయి. అయితే ఈ కాకి ఒకటి మాత్రం అన్నింటికంటె గట్టిగా, అదే పనిగా ఆపకుండా అరచి కేకలు పెడుతున్నది.

మబ్బుల చాటు నుంచి సూర్యుడు బయటకు వచ్చాడు. చెట్టు చిక్కని నీడను పరచింది. ఒక చిన్నపాటి లోయలా ఉన్న ఆ పల్లపు ప్రాంతం ఎక్కడి నుండో వస్తున్న వేణునాదంతో నిండి పోతున్నది. అది చిత్రంగా హృదయాన్ని కదిలించి వేస్తున్నది.

*(కృష్ణమూర్తి నోట్‌బుక్ నుండి; పుటలు 177-178)*

*Published in August, December & April*

Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliveral please return to :*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64,65)
Greenways Road, Chennai - 600 028.
Tel : 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64,65) Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*